సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం । 3 । జనవరి । 2025



ఆరోగ్యం వైపు అడుగులు

చిన్న, పెద్ద తేడా లేకుండా నిత్యం నడక సాగిస్తూ.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

వివరాలు 8లో ▸



చాంపియన్‌గా పాలమూరు

రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నీలో పాలమూరు, ఖమ్మం జట్లు విజేతగా నిలిచాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 34.6 /15.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

గద్వాలటౌన్ : సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీలలో జిల్లా జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటారు. గత నాలుగు రోజుల నుంచి హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా స్కూల్ మైదానంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలలో జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచింది. సెమీస్‌లో మల్కాజిగిరి జట్టుపై ఓడిన తరువాత మూడో స్థానం కోసం గద్వాల జట్టు కామారెడ్డి జట్టుతో తలపడింది. 3–2 గోల్స్ తేడాతో గద్వాల జిల్లా జట్టు విజయం సాధించి మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చాటిన **జిల్లా జట్టు క్రీడాకారులను ఫుట్‌బాల్** అసోసియేషన్ **అధ్యక్షుడు బండల వెంకట్రాములు, కార్యదర్శి విజయ్‌కుమార్, ఇంటిలిజెన్స్ సీఐ నర్సింహారాజు, సీనియర్ క్రీడాకారుడు జగన్ అభినందించారు.**

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



గద్వాలటౌన్: ఇండోర్ స్టేడియంకు వెళ్లేదారిలో సంస్థానాధీశుల కాలం నాటి రాతికట్టకంతో కూడిన పురాతన బావి ఆక్రమణకు గురవుతుందని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ శంకరప్రభాకర్, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు లక్ష్మణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బావిని ఆక్రమించి, దుకాణాలను నిర్మిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పురాతన బావిని సంరక్షించాలని, ఆక్రమణదారుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ దశరథ్‌కు వినతి పత్రం అందజేశారు.

లావాదేవీలపై అవగాహన ఉండాలి



అలంపూర్ రూరల్ : ప్రతి ఒక్క ఖాతాదారుడు బ్యాంక్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కేశవనాయుడు అన్నారు. పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవనాయుడు మాట్లాడుతూ..ప్రతి ఖాతాదారుడు ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్‌పై అవగహన ఉండి తప్పక పాటించాలన్నారు. టీజీబీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సిద్ధయ్య మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అవగహన కలిగి ఉండి, డిజిటల్ పేమెంట్స్ ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏపీఎం ప్రవీణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి వ్యక్తిగత పొదుపు అనేది చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరక్టర్ ఆంజనేయులు, మేనేజర్ అశోక్ కుమార్, మేనేజర్ నాగరాజు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శిరీష, క్లస్టర కోఆర్డినేటర్లు, మహిళ సంఘాల సభ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.



పురాతన బావి సగ భాగాన్ని పూడ్చివేసిన దృశ్యం

సర్వం.. కబ్జాల పర్వం

ఓ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆక్రమణల పరంపర

- ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జా
- వక్ఫ్ భూములు సైతం వదలని వైనం
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- తాజాగా చింతలపేట వద్ద పురాతన బావిపై కన్ను
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి యత్నం
- ప్రజాసంఘాలు, క్రీడాకారులు ఆందోళనతో విషయం వెలుగులోకి..



రాజుల కాలం నాటి పురాతన బావి

గద్వాల: ఆయనొక మాజీ మున్సిపల్ చైర్మన్.. 90వ దశకంలో ఆయన ఆడిందే ఆటగా సాగింది. ఇంకేముంది గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడెక్కడ విలువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో గుర్తించాడు.. తెలివిగా ఆ భూములకు సంబంధించి రాజుల వద్ద కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించి దర్జాగా కబ్జా చేసి రూ.కోట్లు కొల్లగొడుతూ వచ్చాడు. ఇదేమని ప్రశ్నిస్తే ఆ స్థలాలు గతంలో రాజుల వద్ద మా తండ్రి కొనుగోలు చేశాడంటూ బుకాయించి కట్టుకథలు వల్లె వేస్తాడు. కబ్జా చేసిన స్థలాలను కాపాడుకునేందుకు అధికారంలో ఎవరు ఉంటే వారి అడుగులకు మడుగులు వత్తడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తాజాగా గద్వాల పట్టణంలో చింతలపేటలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రాజుల కాలం నాటి బావిని పూడ్చి దానిపై కమర్షియల్ షాపులు నిర్మించేందుకు సదరు నాయకుడు స్కెచ్ వేశాడు. దీనిపై ప్రజాసంఘాలు, క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తూ సదరు నేతపై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గతంలోనూ ఈయన విలువైన భూములను గుర్తించి ఆ స్థలాలను కొనుగోలు చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడు. వాటిని తన పేరిట ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడమే కాకుండా ఆయన వారసులకు సైతం కట్టబెట్టాడు.

మచ్చుకు కొన్ని..

❒ గద్వాల పట్టణం నడిబొడ్డున రథశాల వద్ద ఓ మెడికల్ షాపును గతేడాది ఓ పూల వ్యాపారికి సదరు మాజీ మున్సిపల్ చైర్మన్ రూ.2.50 కోట్లకు విక్రయించాడు. పనిలో పనిగా ఆ షాపు ముందు భాగంలో ఉండే సుమారు రూ.1 కోటి విలువ చేసే మున్సిపల్ స్థలానికి సైతం నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి దానిని కూడా సదరు పూల వ్యాపారికి విక్రయించాడు. ఇలా కొనుగోలు చేసిన మున్సిపల్ ఖాళీ స్థలంలో షాపు నిర్మాణం చేపట్టాడు సదరు పూల వ్యాపారి. ఈ అక్రమ నిర్మాణంపై 'సాక్షి' వరుస కథనాలు వెలువర్చింది. దీంతో విచారించిన అధికారులు మున్సిపల్ స్థలంలో చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకొని.. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ స్థలాన్ని విక్రయించిన సదరు మాజీ మున్సిపల్ నేతకు నోటీసులు ఇచ్చి రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలేమి తీసుకోకుండానే వదిలేశారు.

❒ రెండవ రైల్వే గేటు సమీపంలో సర్వే నంబర్ 777లో 9.05ఎకరాలు వక్ఫ్‌బోర్డు స్థలంపై సదరు నేత కన్నేశాడు. దీని ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ.50 కోట్లపైనే ఉంటుంది. ఈ స్థలంపై కూడా నకిలీ డాక్యుమెంట్లు, ఓఆర్‌సీలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ స్థలంలో తనపేరిట కాలనీని ఏర్పాటు చేసుకుని ఇళ్ల నిర్మాణం చేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ వ్యవహారంలో అప్పట్లో వక్ఫ్‌బోర్డు అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు వక్ఫ్‌బోర్డు అధికారి గద్వాల పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు నేతపై చీటింగ్, ఫోర్జరీ కింద కేసులు కూడా నమోదయ్యాయి. అయితే మరో వైపు ఈ స్థలానికి తామే నిజమైన వారసులమని ఖాజీలు కోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రస్తుతం కోర్టులో కేసు కొనసాగుతుంది.

❒ ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో ఓ ప్రముఖ ద్విచక్ర వాహన షోరూం ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో కూడా వివాదం నెలకొంది. తమ స్థలాన్ని నకిలీ ధ్రువపత్రాలతో కబ్జా చేశాడని పేర్కొంటూ బాధితులు ఉన్నతాధికారులతోపాటు, కోర్టును ఆశ్రయించారు. దీని విలువ సుమారు రూ.3 కోట్లపైనే ఉంటుందని అంచనా.

❒ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న పురాతన బావిని అప్పటి రాజుల వద్ద కొనుగోలు చేసినట్లు చెబుతూ ఆ బావిని సగభాగం పూడ్చివేసి దాని స్థానంలో కమర్షియల్ షాపులు నిర్మించేందుకు యత్నించాడు. దీని విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

బావి స్థలాన్ని కాపాడాలి

గద్వాలలోని చింతలపేట వద్ద ఉన్న బావి నలసోమనాద్రి కాలంలో నిర్మించారు. ఏళ్లుగా బావి నీరు పట్టణవాసుల దాహార్తిని తీర్చుతూ వచ్చింది. చుట్టుపక్కల పనిచేసే కూలీలు బావి నీటితోనే దాహార్తి తీర్చుకుంటారు. ఈ బావిని కబ్జా చేసి కమర్షియల్ షాపులు నిర్మించాలని చూస్తున్న నాయకుడిపై చర్యలు తీసుకోవాలి.

– బస్సు మోహన్‌రావు, సీనియర్ సిటీజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు

క్రీడాకారులకు ఇబ్బందులు

క్రీడాకారులకు అందుబాటులో ఉండే ఏకైక ఇండోర్ స్టేడియం ఇదే. ఈ స్టేడియానికి ఆనుకుని నిర్మించిన ఫంక్షన్‌హాలు నుంచి ఆహార వ్యర్థాలు వెలువడడం.. స్టేడియం ఆవరణలో పారుతుండడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ప్రభాకర్, రిటైర్డ్ పీడీ, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు

విచారించి చర్యలు తీసుకుంటాం



మీరు చెబుతున్న పురాతన బావి కబ్జా చేసి పూడ్చిన ఘటన నా దృష్టికి రాలేదు. దీనిపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి నివేదిక తెప్పించుకుంటాను. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– సంతోష్, కలెక్టర్

ఇండోర్ స్టేడియం.. వ్యర్థాలమయం

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇండోర్ స్టేడియానికి ఆనుకుని ఇటీవల సదరు నేత ఓ ఫంక్షన్ హాలును నిర్మించాడు. ఈ ఫంక్షన్‌హాలు నుంచి వెలువడే ఆహార వ్యర్థ పదార్థాలు ఇండోర్ స్టేడియం వైపే వెళ్లేలా డ్రైనేజీ ఏర్పాటు చేశాడు. దీంతో వ్యర్థాలతో స్టేడియం మొత్తం దుర్వాసనతో నిండిపోయింది. ఆటగాళ్లకు, వాకింగ్ చేసే వారికి తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తుంది. అదే విధంగా దానిపక్కనే ఉన్న ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదిలాఉండగా, సదరు నాయకుడు తాను ఆక్రమించిన స్థలాలను కాపాడుకునేందుకు ఎవరు అధికారంలో ఉంటే వారికి గొడుగు పడుతూ దర్జాగా కాలం గడుపుతున్నాడు. అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని యత్నించే అధికారులపై రాజకీయ పలుకుబడితో ఒత్తిళ్లు తీసుకొచ్చి తప్పించుకుంటున్నాడు.

వేరుశనగ క్వింటా రూ.6,589

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 1164 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6589, కనిష్టం రూ.3269, సరాసరి రూ.5311 ధరలు పలికాయి. అలాగే, 26 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ.5579, కనిష్టం రూ.5319, సరాసరి రూ.5369 ధరలు లభించాయి. 269 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2426, కనిష్టం రూ.1956, సరాసరి రూ.2103 ధరలు పలికాయి. 217 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.7559, కనిష్టం రూ. 5839, సరాసరి రూ. 7559 ధరలు వచ్చాయి.

అంకితభావంతో పనిచేయాలి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు

గద్వాల: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, ప్రభుత్వం అందించే వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలు అర్హులైన వారికి దక్కేలా కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో సమావేశం హాలులో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు జిల్లా అభివృద్ధికి నూతన ఉత్సాహంతో పనిచేయాలని, సంవత్సర కాలం పాటు జిల్లాలో పనిచేసిన అనుభవం విలువైనదని ఈ ఏడాది కూడా మరింత ఉత్సాహంతో పనిచేస్తానన్నారు. ప్రతిఒక్కరు నూతన ప్రణాళికతో కట్టుదిట్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. 2024లో వెనకబడ్డ అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాదికి సమగ్ర ప్రణాళికలతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ఆర్డీఓ, ఇతర శాఖల అధికారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకగా జరుపుకొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరి



వాహనాదారులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ రవాణా శాఖాధికారి కృష్ణారెడ్డి

గద్వాల క్రైం: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందిగా జిల్లా ఇన్‌చార్జ్ రవాణాధికారి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా రవాణా కార్యాలయంలో వాహనదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రత వారోత్సవాలను ప్రతి ఏటా నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వాహనదారులకు తెలియజేస్తామన్నారు. సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు సామర్థ్యం కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ, నిద్రలేమి కారణాలతో డ్రైవింగ్ చేయరాదని ఈ సందర్భాల్లోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మోటార్ వాహన యాక్టు మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు రాములు, రుక్మేందర్, మూజ్జుహమ్మద్, గోవర్ధన్, రుషి, గోవిందు, శ్రీను సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



మల్దకల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న హృదయరాజు

మల్దకల్: మార్చిలో జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుకొని వంద శాతం ఉత్తీర్ణతను సాధించాలని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి హృదయరాజు సూచించారు. గురువారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకుల హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని మంచి ఉత్తీర్ణతను సాధించాలన్నారు. విద్యార్థులకు ఇంటర్ విద్య ఎంతో కీలకమని, తమ బంగారు భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదే విధంగా విద్యార్థులకు మత్తు , డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నర్సింహులు, అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్, భాగ్యలక్ష్మీ, గోవర్ధన్‌శెట్టి, దేవసేనారెడ్డి, తిమ్మోతి, శ్రీనాథ్, రవి ప్రకాష్ శెట్టి పాల్గొన్నారు.

'వంటా–వార్పు'తో ఉద్యోగుల నిరసన



గద్వాలలో వంటా వార్పుతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

గద్వాలటౌన్ : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన రోజుకో రీతిలో వినూత్నంగా సాగుతున్నాయి. గురువారం 24వ రోజు దీక్ష చేపట్టిన కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు 'వంట–వార్పు'తో నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డుపై సామూహికంగా భోజనాలు చేశారు. ఈ నేపథ్యంలో వివిధ సంఘాల నాయకులు వేర్వేరుగా సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. క్రమబద్ధీకరించే వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు, కేజీబీవీ ఎస్ఓలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు

'ఇందిరా మహిళాశక్తి'లో ఉపాధి అవకాశాలు

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 350 యూనిట్లు
- 10 శాతం సభ్యుల వాటా, మిగతాది బ్యాంక్ రుణం



ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాలు			
	నారాయణపేట 6,469	జోగులాంబ గద్వాల 4,047	వనపర్తి 5,101
	మహబూబ్‌నగర్: 8,989	నాగర్‌కర్నూల్ 13,487	

అచ్చంపేట: మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా 17 రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నది. ప్రభుత్వ స్థలాల్లో మహిళాసంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 4 వేల ప్లాంట్లను కేటాయించనుండగా.. ఉమ్మడి జిల్లాలో దాదాపు 350 యూనిట్ల వరకు వచ్చే అవకాశం ఉందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. వీటి స్థాపనకు ప్రభుత్వమే భూమిని సమకూర్చి రుణ సదుపాయం కల్పించనుంది. స్వయం సహాయక సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుంటే జిల్లావ్యాప్తంగా సోలార్ వెలుగులు విరజిమ్మనున్నాయి. ఆశించిన మేరకు ప్రభుత్వ భూములు జిల్లాలో ఉన్నాయి. మహిళా సంఘాలకు భూములను తక్కువ లీజుకు కేటాయించే అవకాశముంది. ఒక్క మెగా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు4 ఎకరాల స్థలం అవసరం. ఒక్కో ప్లాంట్ రూ.3 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో 10 శాతం మహిళా సంఘాలు చెల్లిస్తే 90 శాతం బ్యాంక్ రుణం ఇప్పించనున్నారు.

స్థలాల ఎంపిక కోసం ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి డీఆర్‌డీఓ కార్యాలయాల నుంచి తహసీల్దార్లకు ప్రభుత్వ స్థలాల ఎంపిక కోసం ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే నాగర్‌కర్నూలు జిల్లాలో సోలార్ విద్యుత్ ప్లాంట్లకు ఐదు మండలాల్లో స్థలాల ఎంపిక పూర్తి చేశారు. 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 2 నుంచి 5 కిలోమీటర్ల దూరంలోనే స్థలాలను ఎంపిక చేయాలని నిబంధన పెట్టారు. ఆయా మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్వహణపై త్వరలో శిక్షణ ఇప్పించనున్నారు.

ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం

పొదుపు సంఘాల మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళా శక్తి పేరుతో మహిళల వ్యాపారాల ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టింది. ఈమేరకు ఇప్పటికే ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఈమేరకు అన్ని జిల్లాలకు లక్ష్యాలను నిర్దేశించిగా వాటిపై ఆసక్తి ఉన్న మహిళల వివరాలు సేకరించి అందులో ప్రోత్సాహం కల్పిస్తోంది.

శిక్షణ ఇప్పిస్తాం

నాగర్‌కర్నూలు జిల్లాలో రెవెన్యూ అధికారుల సహకారంతో 5గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల ఎంపిక చేశాం. ఆయా గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇప్పిస్తాం. మరికొన్ని చోట్ల స్థలాలు లభిస్తే సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రణాళికలు పంపనున్నాం.

– ఓబులేష్ డీఆర్‌డీఓ

ఒక్కో యూనిట్ రూ.3.13

సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ యూనిట్‌కు రూ.3.13 చొప్పున ధర డిస్కమ్‌ల(విద్యుత్ ఉత్పత్తి సంస్థల)తో ప్రభుత్వమే కొనుగోలు చేయిస్తుంది. దీంతో మహిళా సంఘాలకు ఏడాదికి సుమారుగా రూ.30లక్షల ఆదాయం వస్తుందని అంచనా.

15 నుంచి ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్/అమ్రాబాద్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఈ నెల 15నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం అలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. ఆలయ పాలక మండలితో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ప్రత్యేకంగా నిధులు తీసుకు వచ్చి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

➪ అమ్రాబాద్ మండలంలోని తెలుగుపల్లి ఆంజనేయస్వామి ఆలయంతో పాటు అటవీ ప్రాంతంలోని అంతర్‌గంగ శివాలయాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పురాతన ఆలయాలు, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల బృందం నల్లమలను సందర్శించి పర్యాటకానికి అనువైన ప్రాంతాలను పరిశీలించినట్లు చెప్పారు. అంతేకాకుండా రూ. 7,700 కోట్లతో మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు హైవేతో పాటు ఎలివేటెడ్ కారిడార్ మంజూరైందని అన్నారు. ముఖ్యంగా మద్దిమడుగు సమీపంలోని కృష్ణానదిపై వంతెన నిర్మాణం, రైతాంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు కట్ట శేఖర్‌రెడ్డి, పవన్, వినోద్, అర్చకుడు వీరయ్యశాస్త్రి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, వెంకటయ్య, ముక్రాంఖాన్, మనోహర్, వెంకటయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం గ్రామానికి చెందిన ఆంజనేయులు(23) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. డిసెంబర్ 31న తన స్నేహితులతో కలిసి సోమశిలకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తున్న సమయంలో గ్రామానికి సమీపంలో ద్విచక్ర వాహనం పై నుంచి అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు బలవన్మరణం


రాముడు (ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని తూముకుంటకు చెందిన రైతు ఆవుల రాముడు(48) గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. గురువారం ఉదయం ఇంట్లో పురుగుమందు తాగగా వెంటనే కుటుంబ సభ్యులు కొల్లాపూర్ ఆస్పత్రికి అటు నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. రాముడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, కుమార్తెల వివాహాలకు అప్పులు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎకరా పొలం విక్రయించాలని చూసినా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు.

పెట్రోల్ పోసుకొని.. వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం రాత్రి అదే కాలనీకి చెందిన రాందాసు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాందాసు కొంతకాలం పుర పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసి ఇటీవలే తాపీ పనికి వెళ్తున్నారని.. మానసిక సమస్యతో బాధపడుతున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ రామస్వామిగౌడ్ వివరించారు.

ఆరోగ్యం వైపు అడుగులు

పట్టణ, గ్రామీణ ప్రజల్లోనూ పెరుగుతున్న స్పృహ

- వాకర్స్‌తో సందడిగా రోడ్లు, మైదానాలు
- సెలవు రోజుల్లో సమీప గుట్టలపై ట్రెక్కింగ్
- నిత్యం వ్యాయామంతో రోగాలు దూరం
- ఆదర్శంగా నిలుస్తున్న వాకింగ్ క్లబ్‌లు

కొత్తకోట: సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం నడక, వ్యాయామం, యోగా, ధ్యానం తప్పనిసరి.. ప్రధానంగా అజీర్తి నుంచి అర్థరైటిస్ వరకు, రక్తపోటు నుంచి గుండెపోటు వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్యల వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేయాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్షణం తీరిక లేకుండా ఉద్యోగాల్లో తలమునకలయ్యే వారు శారీరక, మానసిక ఒత్తిడిని అధికమించేందుకు వ్యాయామాన్ని తమ జీవన విధానంలో భాగంగా చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రజల్లోనూ ఆరోగ్య స్పృహ పెరిగింది. తెల్లవారుజామునే లేచి యువకులు రోడ్ల వెంబడి పరుగులు పెడుతుండగా.. పెద్దవారు నడక సాగిస్తున్నారు. అనంతరం మైదానాలకు వెళ్లి కాసేపు సేదతీరి వ్యాయామం, యోగాసనాలు వేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. రోజురోజుకూ పట్టణాలు, గ్రామాల్లో వాకర్స్ సంఖ్య పెరుగుతుండటంతో రోడ్లు, మైదానాలు ఉదయం పూట సందడిగా కనిపిస్తున్నాయి.

2015లో క్లబ్ ఏర్పాటు..

కొత్తకోట పట్టణంలో మొదటిసారిగా 2015 జనవరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు శేఖర్‌గౌడ్ 12 మందితో కలిసి ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఏర్పాటు చేశాడు. ఆ క్లబ్ నిర్వహిస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రస్తుతం 60 మంది సభ్యుల వరకు చేరి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. అంతేకాక పట్టణంలోని పలువురు ఆరోగ్య వాకింగ్ క్లబ్‌ను ఆదర్శంగా తీసుకుని ఛత్రపతి ఆరోగ్య వాకింగ్ క్లబ్, కానాయపల్లి ఆరోగ్య వాకింగ్ క్లబ్, సన్‌రైస్ వాకింగ్ క్లబ్, వందేమాతరం వాకింగ్ క్లబ్, జైభారత్ వాకింగ్ క్లబ్, జైశ్రీరాం వాకింగ్ క్లబ్, సాయి వాకింగ్ క్లబ్, వాకింగ్ వారియర్ క్లబ్‌లను ఏర్పాటు చేసుకొని నిత్యం క్రమం తప్పకుండా ఉదయాన్నే గ్రౌండ్‌కు వెళ్లి వాకింగ్, యోగా, ధ్యానం, సూర్య నమస్కారాలు చేస్తున్నారు.

అందరికీ ఆదర్శంగా..

గతేడాది వరల్డ్ యోగా డే సందర్భంగా కాలినడకన కొత్తకోట నుంచి వనపర్తి వరకు 15 కిలోమీటర్లు నడిచి అప్పటి కలెక్టరేట్‌లో యోగా డే నిర్వహించారు. ప్రత్యేక సెలవు దినాల్లో యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు, ఉత్తమ విద్యార్థులకు సన్మానాలు చేసి వారిని ప్రోత్సహిస్తున్నారు.

➪ రాజపేటలోని గుర్రం గట్టు, కొల్లాపూర్ సమీపంలోని ఎత్తం గట్టు, ఖిల్లాఘనపురం గట్టు, కోయిల్‌కొండ గట్టు, కందూరు రాతి గుట్టలపై ట్రెక్కింగ్ కార్యక్రమాలు చేపట్టారు.


కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులు

నియమాలు.. ఫైన్లు



ఆరోగ్య వాకింగ్ క్లబ్‌ను ఆదర్శంగా తీసుకున్న మిగతా గ్రూపుల సభ్యులు ప్రతిరోజు వారు కేటాయించుకున్న సమయం ప్రకారం మైదానానికి రావాలి. లేకపోతే ప్రతిరోజు రూ.20 ఫైన్ చెల్లించాల్సిందే. అలాగే డ్రెస్ కోడ్ పెట్టుకొని రోజు వేసుకునేలా నియమాలు పెట్టుకున్నారు. దీంతో పాటు ప్రతినెల ఆయా గ్రూపుల వారు చిట్టీలు వేస్తూ విహార యాత్రలకు వెళ్తున్నారు. తీర్థ యాత్రలతోపాటు, ఆహ్లాదకరమైన ప్రాంతాలకు వెళ్తూ సేద తీరుతున్నారు. ఇటీవల కొన్ని వాకింగ్ గ్రూపులు బ్యాంకాక్, మలేషియా, సింగపూర్, దుబాయ్ వంటి దేశాలకు సైతం వెళ్లి వచ్చాయి.

బరువు అదుపులో..



రోజూ వాకింగ్ చేయడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. దీంతోపాటు రోజూ తీసుకునే ఆహారం కూడా మితంగా ఉండాలి. దీనివల్ల నాకు ఎలాంటి రుగ్మతలు లేవు. పడిగడుపున గోరువెచ్చని నీళ్లు తాగిన తర్వాత వాకింగ్ మొదలుపెడతాను. ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. రోజూ వాకింగ్ చేయడం వల్ల ఉల్లాసంగా జీవిస్తున్నా.

– నాగేష్ సాగర్, ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యుడు


వివిధ ఆసనాలు వేస్తున్న ఆరోగ్య వాకింగ్ సభ్యులు

ప్రశాంతంగా ఉంటుంది..



గత పదేళ్లుగా వాకింగ్ చేస్తున్నాను. రోజూ వాకింగ్ చేయడం వల్ల ప్రశాంతంగా ఉంటుంది. నాతోపాటు అందరికీ ఆరోగ్యం ఉండాలనే మంచి ఉద్దేశంతో ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఏర్పాటు చేశాం. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ వ్యాయామం, యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– శేఖర్‌గౌడ్, ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఫౌండర్

వయసుతో సంబంధం లేదు



నా వయసు 53 ఏళ్లు. వాకింగ్, ధ్యానం, యోగాలు చేయడానికి వయసుతో సంబంధం లేదు. నేను పదేళ్లుగా వాకింగ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి రుగ్మతలు రాలేదు. నడక నాకు ఇష్టం. రోజు 4 కిలోమీటర్లు నడిస్తే గాని ప్రశాంతంగా ఉండదు. ప్రతిరోజు వాకింగ్ చేయాలని నా స్నేహితులను ప్రోత్సహిస్తున్నా.

– కావలి ఎల్లయ్య, ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యుడు

విహార యాత్రలకు..



వాకింగ్ చేయడం వల్ల రోజంతా చురుకుగా ఉంటుంది. రోజూ 5 కిలోమీటర్లు వాకింగ్ చేస్తున్నా. తోటి స్నేహితులతో వ్యాయామం, యోగా చేయిస్తున్నాను. అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం బాగుంటుంది. గ్రూపు ఆధ్వర్యంలో అప్పుడప్పుడు మానసిక ప్రశాంతత కోసం విహార యాత్రలకు వెళ్తున్నాం.

– ముంత రామకృష్ణ, ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యుడు

ఊరికి దారి అడిగి నగలు చోరీ

నవాబుపేట: ఊరికి ఎలా వెళ్లాలి అని దారి అడిగి ఆపై ఆమె మెడలో ఉన్న బంగారు నగలు చోరీ చేసిన ఘటన మండలంలోని చౌడూర్‌లో గురువారం చోటుచేసుకుంది. మెట్టుగడ్డతండాకు చెందిన బనావత్ శారద తన తల్లి కోటమ్మతో కలిసి తండా సమీపంలోని చౌడూర్‌కు తల్లి పింఛన్ తీసుకునేందుకు వచ్చింది. కాగా పింఛన్ తీసుకుని తిరిగి తండాకు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి తండాకు దారి ఎలా వెళ్లాలని అడిగాడు. దీంతో ఇద్దరు అదే తండాకు వెళ్తున్నామంటూ చెప్పడంతో తన తల్లిని వాహనంపై ఎక్కించుకుని కొద్ది దూరంలో దించాడు. తిరిగి వచ్చి తన మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కుని వాహనంపై పరారయ్యాడు. దీంతో వెంటనే బాధితురాలు తండాకు వెళ్లి విషయం చెప్పింది. ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సకాలంలో వైద్యం అందక యువకుడు మృతి

కొత్తపల్లి: సకాలంలో వైద్యం అందక యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి తండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి తండాకు చెందిన శంకర్ అలియాస్ శ్రీను (26)రెండేళ్లుగా జడ్చర్ల పోలెపల్లి సెజ్‌లో పనిచేస్తూ.. జడ్చర్లలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే విధులను ముగించుకొని ఇంటికి వచ్చిన అతడు సమీపంలోని దేవాలయానికి వెళ్లాడు. అక్కడ అకస్మాత్తుగా హైబీపీతో కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడి మిత్రుడు బిచ్యానాయక్ గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనట్లు వైద్యులు గుర్తించి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. మహబూబ్‌నగర్ నుంచి నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ బెడ్ ఖాళీగా లేదని, మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. ఈ క్రమంలోనే శంకర్ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందాడు. అతడి మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వివాహితపై అత్యాచార యత్నం

తిమ్మాజిపేట: మండలంలోని ఆవంచ గ్రామంలో ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి యత్నించినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. గతనెల 31న రాత్రి సదరు వ్యక్తి మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడని.. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



జాతీయస్థాయి పోటీలకు పెద్దఆదిరాల విద్యార్థి


జడ్చర్ల టౌన్: మహారాష్ట్రలో ఈనెల 7నుంచి జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు మండలంలోని పెద్ద ఆదిరాల హైస్కూల్‌కు చెందిన పవన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య గురువారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆ ర్మూర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ -17 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం మహారాష్ట్రకు బయలుదేరి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అభినందించామన్నారు. అభినందించిన వారిలో పీడీ మోయిన్, ఉపాధ్యాయులు మధు, చంద్రశేఖర్, నార్యనాయక్, శ్యాంసుందర్, వెంకటయ్యలు ఉన్నారు.

వచ్చీరాని వైద్యం..!

పేదల అమాయకత్వమే.. పెట్టుబడి


ఆగస్టు 30న జిల్లాకేంద్రంలోని హబీబ్‌నగర్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి డీఎంహెచ్‌ఓ పద్మ, జిల్లా మాస్ మీడియాధికారి మంజుల, వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఓ ఇంట్లో సాధిక్ అనే వ్యక్తి రెండు పడకలు ఏర్పాటు చేసి అపరిశుభ్ర వాతావరణంలో.. గాలి, వెలుతురు లేకుండా వైద్యం చేయడంతోపాటు ఇంజెక్షన్లు ఇవ్వడం, కొన్ని పరికరాలు వాడుతూ వైద్యం చేస్తున్నట్లు గుర్తించి.. సదరు క్లినిక్‌ను సీజ్ చేశారు.


డిసెంబర్ 21న అడ్డాకులలో అన్వర్ అనే ఆర్‌ఎంపీ అనుమతి లేకుండా కేఎంపీ పేరుతో క్లినిక్ నిర్వహిస్తూ ఇంజెక్షన్లు, ఐవీ గ్లూకోజ్ పెట్టడం, యాంటీబయోటిక్స్ ఇస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించి సీజ్ చేశారు. ఈ క్రమంలో అర్హత లేకపోయిన వైద్యం చేయడమే కాకుండా ఇంజెక్షన్లు, మందులు ఇస్తున్నట్లు నిర్ధారించారు.



- జిల్లాలో మితిమీరుతున్న ఆర్‌ఎంపీల ఆగడాలు
- స్థాయికి మించి వైద్యసేవలతో ప్రాణాల మీదకు..
- కొందరిని ప్రైవేట్‌కు సిఫార్సు చేసి కమీషన్ల వసూలు
- ప్రత్యేకంగా వేతనాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్న యాజమాన్యాలు
- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న వైద్యాధికారులు

పాలమూరు: కనీస అర్హత లేకపోయిన వైద్యుడిగా చెలామణి అవుతారు.. అనుమతులు తీసుకోకుండానే క్లినిక్‌లు ఏర్పాటు చేస్తారు. యథేచ్ఛగా వైద్యం అందిస్తారు. అది కూడా ప్రాథమిక వైద్యం కాకుండా.. ఎంబీబీఎస్ మాదిరిగా పెద్దపెద్ద రోగాలకు సైతం వైద్యం చేస్తూ.. అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అలాగే కొందరు రోగులను పట్టణాల్లోని ఇతర వైద్యుల దగ్గరకు పంపిస్తూ కమీషన్లు రాబడుతున్నారు. అధికారుల అలసత్వాన్ని అర్హతగా చేసుకొని.. పేదల అమాయకత్వాన్ని పెట్టుబడిగా మార్చుకొని.. జిల్లాలోని ఆర్‌ఎంపీలు నిత్యం రూ.వేలు సంపాదిస్తూ.. రూ.లక్షలకు పడగలెత్తుతున్నారు. కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఆర్‌ఎంపీలకు వేతనాలు ఇచ్చి మరీ ప్రోత్సహించే స్థాయికి చేరుకున్నారు.

విధిలేని పరిస్థితిలో..

గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సరైన వైద్యం అందకపోవడం, ప్రైవేట్ ఆస్పత్రులకు ఫీజు చెల్లించే స్తోమత లేనివారు విధిలేని పరిస్థితిలో ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అయితే వీరిలో కొద్ది మంది ఆర్‌ఎంపీలు మాత్రమే ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులకు పంపుతున్నారు. కానీ, చాలా మంది ఆర్‌ఎంపీలు మాత్రం చిన్నపాటి శస్త్రచికిత్సలు సైతం చేస్తూ ఇన్‌ఫెక్షన్లు, ఇతరత్రా ఇబ్బందులకు కారణమవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులున్నా.. వారు తమ సొంత ఆస్పత్రులకు ఎక్కువగా ప్రాధాన్యమివ్వడం, సమయపాలన పాటించకపోవడం, వచ్చిన రోగులకు సరైన వైద్యం చేయకపోవడంతో నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రాంత రోగులు స్థానికంగా అందుబాటులో ఉండే ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లి.. జేబు చమురు వదుల్చుకోవడమే కాకుండా.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

యాక్షన్ ప్లాన్ ప్రకారం..



జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖ నుంచి ఆర్‌ఎంపీలు ఎవరికీ క్లినిక్‌లు నిర్వహించడానికి అనుమతులు ఇవ్వలేదు. ప్రస్తుతం విస్తరిస్తున్న ఆర్‌ఎంపీ వ్యవస్థపై పూర్తిగా నిఘా పెడుతున్నాం. ఇప్పటికే సదరు అసోసియేషన్ సభ్యులను హెచ్చరించాం. అనుమతి, అర్హతకు మించి ఎవరు వైద్యం చేసిన అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ప్రకారం జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేయడానికి సిద్ధమవుతున్నాం. ఫిర్యాదులు వచ్చిన క్లినిక్‌లతోపాటు ఏదైనా ఘటనలు జరిగిన వాటిని సైతం సీజ్ చేస్తున్నాం.

– కృష్ణ, డీఎంహెచ్‌ఓ, మహబూబ్‌నగర్

250కి పైగా క్లినిక్‌లు..

జిల్లాలో దేవరకద్ర, కోయిలకొండ, జడ్చర్ల, నవాబ్‌పేట, హన్వాడ మండలాల పరిధిలోని గ్రామాలతో పాటు మహబూబ్‌నగర్ శివారు పల్లెల్లో ఆర్‌ఎంపీల వైద్యం బాగా విస్తరించింది. ఇంజెక్షన్లతో పాటు నెబ్యులైజర్, సెలైన్ బాటిళ్లు ఎక్కిస్తున్నారు. ప్రమాదంలో కాళ్లు, చేతులు విరిగిన క్షతగాత్రులకు అత్యవసర సేవలు అందించేందుకు సైతం వెనకాడటం లేదు. కొంత మంది ఫిజియోథెరపీలు ఎక్స్‌రే, ప్రిస్క్రిప్షన్లు రాస్తూ చికిత్స రాస్తున్నారు. ఇటీవల ఓ ఆర్‌ఎంపీ చేసిన చికిత్స కారణంగా రోగి కాలు నడువలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో అధికారికంగా ఏ ఒక్కరికి అనుమతి లేకపోయినా.. మాత్రం 250కి పైగా క్లినిక్‌లు ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కొరవడిన నిఘా


జిల్లాలో నకిలీ వైద్యులపై నిఘా పూర్తిగా కొరవడింది. ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చే వైద్య, ఆరోగ్యశాఖ, ఆస్పత్రుల సేవలను సమన్వయం చేయాల్సిన డీసీహెచ్‌ఎస్ నకిలీ వైద్యులపై ఏమాత్రం దృష్టిపెట్టడం లేదు. దీంతో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ఆర్‌ఎంపీలకు అనుమతులు ఇవ్వడంలో కూడా అవినీతి రాజ్యమేలుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

నూనె గింజల పంటల సాగుతో లాభాలు

- మేలైన వంగడాలతో అధిక దిగుబడులు సాధ్యం
- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి

మదనాపురం: యాసంగిలో వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమలు వంటి నూనె గింజల పంటలను సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి తెలిపారు. మేలైన విత్తనాలు ఎంచుకోవడంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని సూచించారు.

ఆముదం: యాసంగిలో ఆముదం సాగు చేయడం ద్వారా బుజు తెగులు, చీడపురుగుల సమస్య తక్కువగా ఉంటుంది. అధిక దిగుబడులు పొందొచ్చు. పీసీహెచ్-111 అనే హైబ్రీడ్ రకం 120 రోజుల నుంచి 140 రోజుల్లో పంట వస్తోందన్నారు. ఎండు తెగుళ్ల తట్టుకొని ఎకరాకు ఏడు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. భారతీయ నూనె గింజల సంస్థ నుంచి విడుదలయిన డీసీహెచ్-519, డీపీహెచ్-177, ఐసీహెచ్-66 అనే రకాలు అన్ని రకాల తెగుళ్ల తట్టుకొని అధిక దిగుబడులు ఇస్తాయని వివరించారు.


కుసుమ గింజలు

పాడి-పంట


కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి

వేరుశనగ : యాసంగిలో పండించే వేరుశనగ వానాకాలం పంటకంటే రెండింతలు దిగుబడి వస్తుంది. కదిరి-6, కదిరి-9, టీఏజీ-24 రకాలు యాసంగికి అనుకూలం. కదిరి-6 ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్లు, చిన్న గుత్తి రకం కదిరి-9 నీటి ఎద్దడి, ఆకుమచ్చ తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకొని 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి ఎకరాకు వస్తుంది. కదిరి- 6, 9 రెండు రకాలు 100 నుంచి 120 రోజుల్లో కోతకు వస్తుంది. టీఏజీ-24 రకం 95 నుంచి 100 రోజుల్లో పంట రాగా.. 8 నుంచి 10 క్వింటాళ్ల పంట దిగుబడి వస్తోంది.

కుసుమ: వర్షాభావ పరిస్థితుల్లో వానాకాలం పంట దెబ్బతిని నష్టపోతే.. అడవి పందుల బెడద అధికంగా ఉండే వేరుశనగ, మొక్కజొన్న పండించే ప్రాంతాల్లో ఈ పంట ప్రత్యామ్నాయంగా సాగుచేసుకోవచ్చు. టీఎస్ఎఫ్-1 అనే తెల్లకుసుమ రకం ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్లు, మంజీర రకం 120 రోజుల్లో ఎకరాకు 4 నుంచి 5, పీబీఎన్ఎస్-12, జేఎస్ఎఫ్-141 రకం ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.


ఆముదం గింజలు

క్లుప్తంగా...

బకాయిలు చెల్లించండి



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గౌరీ సతీశ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆయన గురువారం సీఎంను కలిసి బకాయిలపై వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం రూ.5 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందని వివరించారు. లక్షలాది మంది పేద విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్నారని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



భట్టి విక్రమార్కను కలిసిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోరింది. సంఘం అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం ఉప ముఖ్యమంత్రిని కలిసింది. రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని కోరారు. సేవలు అందకపోవడంతో వృద్ధాప్యంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.



ధర లేక.. టమాటా పంట కాల్చివేత

రెండెకరాల్లో 7500 కిలోల టమాటా పంట ధ్వంసం

శివ్వంపేట(నర్సాపూర్): టమాటాకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఒక రైతు పంటను తగులబెట్టాడు. మండల పరిధి నవాబుపేట గ్రామానికి చెందిన రవిగౌడ్‌నాలుగు ఎకరాల్లో టమాటా పంటను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పొలం నుంచి పంటను సేకరించి మార్కె ట్‌కు తరలిస్తే.. ఒక్కొక్క బాక్స్‌కు రూ.50 మించి ధర రావడం లేదు. రవాణాకు ఒక్కో బాక్స్‌కు రూ.30 పోగా రూ.20 వస్తున్నాయని, కూలీల డబ్బులు సైతం చేతికి అందడం లేదని రైతు వాపోయాడు. దీంతో గురువారం రెండు ఎకరాల్లోని 7500 కిలోల టమాటా పంటను తొలగించి తగులబెట్టాడు. ఇదే గ్రామంలో 25 మంది రైతులు సుమారు 60 నుంచి 70 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో వీరంతా తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి నెలకొంది.

రహదారి దెబ్బ తినకుండా..



నేలకొండపల్లి: పొలాలు దున్నే ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు దెబ్బ తింటుంటాయి. వాహనచోదకులు కూడా ఇబ్బంది పడుతుంటారు.. దీన్ని నివారించేందుకు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండ రైతు, ట్రాక్టర్ యజమాని మరికంటి కిశోర్ వినూత్న ఆలోచన చేశారు. పొలాలకు వెళ్లేటప్పుడు కేజ్‌వీల్స్ రోడ్డును తాకకుండా మరో ట్రాక్టర్‌కు జతచేసి నడిపిస్తున్నారు. ట్రాక్టర్ ముందు నడుస్తుంటే.. కేజ్‌వీల్స్ ఉన్న ట్రాక్టర్ రివర్స్‌లో వెళ్తుంటుంది. కాగా, ఇది చూసిన వారు రైతు కిశోర్‌ను అభినందిస్తున్నారు.

దాటవేత.. ఎగవేత!

సూపర్ సిక్స్ సహా హామీలకు బాబు మంగళం • 'తల్లికి వందనం' ఎగనామం..

సాక్షి, అమరావతి: అన్ని పథకాలపై దాటవేత ధోరణి.. చర్చల పేరుతో కాలక్షేపం.. ఎగవేతకు దారుల అన్వేషణ..! కొత్త సంవత్సరంలోనూ క్యాబినెట్ సాక్షిగా సూపర్ సిక్స్ హామీలకు కూటమి సర్కారు ఎగనామం పెట్టింది. తల్లికి వందనం నుంచి అన్నదాతా సుఖీభవ దాకా.. ఆడబిడ్డ నిధి నుంచి ఉద్యోగులకు పీఆర్‌సీ, ఐఆర్.. నిరుద్యోగులకు భృతి వరకు ఇదే తీరు!! కొత్త ఏడాది కోటి కళ్లతో ఆశగా ఎదురు చూస్తున్న తల్లులు, రైతన్నలు, ఉద్యోగులు, నిరుద్యోగులకు మళ్లీ నిరాశ మిగిలింది. ఎన్నికల ముందు సూపర్ సిక్స్.. సెవెన్ అంటూ ఎడాపెడా హామీలిచ్చిన సీఎం చంద్రబాబు పీఠం ఎక్కిన తరువాత వాటిని ఎగ్గొట్టేందుకు ఆర్థిక పరిస్థితి, చర్చల పేరుతో కాలక్షేపం చేస్తున్నారు. సూపర్ సిక్స్ సహా ఇతర హామీలను అటకెక్కించి తొలి ఏడాది గడిపేశారు. కొత్త సంవత్సరంలోనూ నిర్దిష్టంగా ఫలానా తేదీ నుంచి అమలు చేస్తామని చెప్పకుండా కాలయాపన చేస్తున్నారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో హామీల అమలుపై కచ్చితమైన నిర్ణయాలు తీసుకోకుండా చర్చల పేరుతో ఎగనామం పెట్టేందుకు ఎత్తుగడ వేయడం గమనార్హం. సీఎం చంద్రబాబు ఈ విద్యా సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకపోవడంతో 87.42 లక్షల మంది విద్యార్థులు ఒక్క ఏడాదే రూ.13,112 కోట్ల మేర నష్టపోయారు. 54 లక్షల మంది రైతన్నలు ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందకపోవడంతో రూ.7,500 కోట్ల మేర నష్టపోయారు. కోటి మందికిపైగా యువత నిరుద్యోగ భృతి కోసం.. 'ఆడబిడ్డ నిధి' కోసం 1.80 కోట్ల మంది మహిళలు పడిగాపులు కాస్తుంటే నూతన ఏడాది నిర్వహించిన తొలి మంత్రివర్గ భేటీలో ఒక్క సానుకూల ప్రకటన కూడా చేయలేదు. వాటిని అమలు చేసే ఉద్దేశం లేకపోవడం వల్లే చర్చల పేరుతో ప్రభుత్వం సాగదీస్తోందని, ఎన్నికల హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు గ్రహిస్తున్నారు. ఇవాళ రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత అదే జగన్ అధికారంలో ఉండి ఉంటే ఈ సమయానికి ఏ పథకాల కింద, ఎంత లబ్ధి చేకూరేదో బేరీజు వేసుకుంటున్నారు.



అమ్మ ఒడి ఆగిపోయి.. తల్లికి వందనం లేక!

పేదరికం చదువులకు అడ్డు కాకూడదని, పేదింటి తలరాతలను మార్చే శక్తి విద్యకే ఉందని దృఢంగా నమ్మిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'అమ్మ ఒడి'పథకాన్ని ప్రవేశపెట్టారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పిల్లలను పాఠశాలలు, కాలేజీలకు పంపిన తల్లుల ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేల చొప్పున క్రమం తప్పకుండా జమ చేశారు. ఒక్క అమ్మ ఒడి ద్వారానే రూ.26 వేల కోట్లకుపైగా తల్లులకు అందించి పిల్లల చదువులకు భరోసా కల్పించారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్రంలో స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఓ కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఇస్తామన్న హామీని చంద్రబాబు అటకెక్కించేశారు. తొలి ఏడాది దీన్ని అమలు చేయకుండా పిల్లల చదువులను నీరుగార్చిన కూటమి సర్కారు అసలు పూర్తిగా పథకాన్నే ఎత్తివేసే దిశగా వ్యూహం రచిస్తోంది.

అన్నదాతలకూ ఎగనామమే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండు వ్యవసాయ సీజన్లు గడుస్తున్నా అందించలేదు. రైతు భరోసా పేరును అన్నదాతా సుఖీభవగా మార్చడం మినహా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది అమలు చేయలేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇప్పటికే రైతులకు రెండు విడతలు ఆర్థిక సాయం అందించడం గమనార్హం. చంద్రబాబు సర్కారు ఆ రెండు విడతలూ అన్నదాతలకు సాయం అందించకుండా ఎగనామం పెట్టింది. కేంద్రం తదుపరి ఇచ్చే వాటా ఆధారంగా రాష్ట్రం ఇవ్వాల్సిన వాటాపై ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించింది. దీంతో గత రెండు విడతలూ కూటమి సర్కారు రైతు భరోసా సాయాన్ని అందించకపోవడంతో 53.58 లక్షల మంది రైతులు రూ.7,500 కోట్ల మేర నష్ట పోయారు.

ఉద్యోగులకు మొండిచెయ్యి

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుపై దృష్టి సారించలేదు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ, కూటమి ప్రభుత్వం రాగానే వెంటనే ఐఆర్ ప్రకటిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చింది. సీపీఎస్/జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని వాగ్దానం చేసింది. ఇంతవరకూ ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం కొత్త పీఆర్సీ ఏర్పాటుతో పాటు కమిషనర్‌ను నియమించింది. అయితే చంద్రబాబు సర్కారు కమిషనర్‌తో రాజీనామా చేయించింది. ఇక పీఆర్సీ కమిషన్ గురించి అసలు పట్టించుకోవడమే లేదు. ఉద్యోగుల సమస్యల్లో ఒక్కటి కూడా పరిష్కరించలేదు. ఇందుకు భిన్నంగా వైఎస్ జగన్ తొలి కేబినెట్ సమావేశంలోనే ఉద్యోగులకు 2019 జూలై 1 నుంచి 27 శాతం ఐఆర్ ఇచ్చారు. ఇప్పుడు ఏడు నెలలైనా ఐఆర్ గురించి చంద్రబాబు సర్కారు అసలు పట్టించుకోవడమే లేదు.

యాదగిరీశుడికి మదర్ డెయిరీ నుంచే నెయ్యి

- విజయ నెయ్యి ఇప్పుడే వద్దని దేవాదాయ శాఖ ఆదేశం
- మదర్ డెయిరీతో మార్చి 31వరకు ఉన్న ఒప్పందం

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీకి మరికొంత కాలం మదర్ డెయిరీ నుంచే నెయ్యిని కొనుగోలు చేయనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి విజయ డెయిరీ నెయ్యిని వినియోగించాలని దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఆ నిర్ణయాన్ని తాత్కాలికంగా ఉపసంహరించుకుంది. ఈ నేపథ్యంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మదర్ డెయిరీ నెయ్యినే వాడనున్నారు. మదర్ డెయిరీ టెండర్ ఒప్పందం మార్చి 31వ తేదీ వరకు ఉన్న నేపథ్యంలో ఆలయానికి ఆ సంస్థ నెయ్యినే కొనుగోలు చేసేందుకు దేవాదాయ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పుడే విజయ డెయిరీ నెయ్యిని సరఫరా చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని దేవాదాయశాఖ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

ఏడాదికి రూ.18 కోట్ల విలువైన నెయ్యి..

యాదగిరీశుడి క్షేత్రంలో లడ్డూతో పాటు ఇతర ప్రసాదాల్లో వాడే మదర్ డెయిరీ నెయ్యి కోసం దేవస్థానం ఏటా సుమారు రూ.18 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతి నెలా 25 వేల నుంచి 30 వేల కిలోల వరకు ఆలయానికి మదర్ డెయిరీ సంస్థ నెయ్యిని సరఫరా చేస్తోంది. కాగా గతేడాది నిర్వహించిన నెయ్యి సరఫరా టెండర్లలో మదర్ డెయిరీతో పాటు విజయ డెయిరీ సంస్థ కూడా పాల్గొంది. ఇందులో ఎల్-1గా నిలిచిన మదర్ డెయిరీతో నెయ్యి కొనుగోలుకు ఆలయం ఒప్పందం చేసుకుంది.

గ్రామాల్లో పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం

- 1.66 కోట్ల మందికి పరీక్షలు
- 22.94 లక్షల మందికి బీపీ ... 11.9 లక్షల మందికి షుగర్
- ఎన్‌సీడీపై ప్రభుత్వ సర్వే ఫలితాలపై ఆరోగ్యశాఖ మంత్రి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో కూడా రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. జీవన విధానంతో పాటు ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, ఒత్తిళ్ల నేపథ్యంలో గ్రామాల్లో కూడా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో ఎన్‌సీడీ వ్యాధులపై ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సర్వే వివరాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఇతర అధికారులు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వివరించారు. 30 సంవత్సరాల వయస్సు దాటిన 1.66 కోట్ల మందికి పరీక్షలు జరపగా, 22.94 లక్షల మందికి రక్తపోటు, 11.9 లక్షల మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో గురువారం మంత్రి రాజనర్సింహతో జరిగిన ఈ సమావేశంలో సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లీనిక్‌లకు బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులను అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లలో అందుతున్న వైద్య సేవలపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా పేషెంట్ల జాబితాను తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలని సూచించారు. బీపీ, షుగర్ పేషెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను కొనసాగించాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ మైనార్టీ నాయకుల మధ్య గొడవ?

మహబూబ్‌నగర్ క్రైం: ఫ్లెక్సీల విషయంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకుల మధ్య గొడవ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బస్టాండ్ నుంచి తెలంగాణ చౌరస్తాకు వెళ్లే దారిలో ఫ్లెక్సీలు కట్టే విషయంలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు గొడవపడినట్లు సమాచారం. ఒకరి ఫ్లెక్సీ తీసివేసి మరొకరి ఫ్లెక్సీ కట్టారంటూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇరు వర్గాలు టూటౌన్ పోలీస్‌లను సంప్రదించారు. అయితే గొడవపడిన నాయకుల మధ్య సయోధ్య కుదుర్చడానికి ఇతర నాయకులు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడులో గురువారం నీటిమట్టం 1,020 అడుగుల మేర ఉంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 588, కుడి, ఎడమ కాల్వ ద్వారా 25, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని నియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

జూరాలకు ఇన్‌ఫ్లో నిల్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు కొన్ని రోజులుగా వస్తున్న స్వల్ప ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. గురువారం ఆవిరి రూపంలో 89 క్యూసెక్కులు పోగా.. ఇతర అవసరాలకు 203 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 500 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,342 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.798 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చాంపియన్లుగా మహబూబ్‌నగర్, ఖమ్మం



పురుషుల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న మహబూబ్‌నగర్-ఖమ్మం జట్లు

- ముగిసిన రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలు
- పురుషుల విభాగంలో అతిథ్య జట్టు విజయం
- రన్నరప్‌గా పాలమూరు మహిళల జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సీఎం కప్ టోర్నీ పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్, మహిళల విభాగంలో ఖమ్మం జట్లు చాంపియన్లుగా నిలిచాయి. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నీ గురువారం ముగిసింది. పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్-ఖమ్మం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా కొనసాగింది. ఆట ముగిసే సమయానికి మహబూబ్‌నగర్ 19-16 పాయింట్ల తేడాతో ఖమ్మంపై విజయం సాధించింది. మహిళల ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టు ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఫైనల్లో ఖమ్మం జట్టు 23-6 పాయింట్ల తేడాతో గెలుపొందింది. పురుషుల విభాగంలో మూడోస్థానంలో నారాయణపేట-మేడ్చల్ జట్లు, మహిళల్లో రంగారెడ్డి-మేడ్చల్ జట్లు సంయుక్తంగా నిలిచాయి. అంతకుముందు జరిగిన పురుషుల విభాగం సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 19-7 పాయింట్ల తేడాతో మేడ్చల్ జట్టుపై, ఖమ్మం జట్టు 15-13 తేడాతో నారాయణపేట జట్టుపై గెలుపొందాయి. మహిళల సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 17-11 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై, ఖమ్మం జట్టు 18-12 తేడాతో మేడ్చల్ జట్లపై విజయం సాధించాయి.

క్రీడాజట్లను అభినందించిన అధికారులు

విన్నర్, రన్నర్, మూడోస్థానంలో నిలిచిన జట్లను జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి విలియం, జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాల్‌రాజు, పీడీలు వేణుగోపాల్, రమేష్‌బాబు, డీఎస్ఏ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, వృత్తిసైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జీ ఎస్.విజయ్‌కుమార్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



పురుషుల నెట్‌బాల్ చాంపియన్ మహబూబ్‌నగర్



మహిళల రన్నరప్ మహబూబ్‌నగర్ జట్టు

అడవిలో అమ్మలగన్న అమ్మ



అటవీ ప్రాంతంలో ఉన్న పర్వతాపూర్ మైసమ్మ ఆలయం..

- నేటి నుంచి పర్వతాపూర్ మైసమ్మ ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

నవాబుపేట: కుహూ కుహూ అంటూ పక్షుల కిలకిలరావాలు.. పచ్చటి వనాలతో కూడిన దట్టమైన అడవి.. పాములాంటి మెలికలతో మలుపులు కలిగి అచ్చం నల్లమలను పోలే విధంగా ఉన్న రోడ్డు.. అడవి మధ్యలో అమ్మలగన్న అమ్మ మైసమ్మ దేవాలయం.. ప్రకృతి రమణీయమైన ఆహ్లాదకర వాతావరణంలో భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న పర్వతాపూర్ మైసమ్మ దేవత ఉత్సవాలు శుక్రవారం నుంచి వారం రోజులపాటు నిర్వహించనున్నారు.

అడవిలో దారి చూపిన దేవతగా..

అటవీ ప్రాంతంలో లభించే కట్టెలను అమ్ముకుని పూట గడుపుకునే వారికి అడవిలో దారి చూపిన దేవతగా మైసమ్మ వెలసింది. ప్రస్తుతం ఉన్న స్థలంలోనే ఒక నెమలి చెట్టు కింద పుట్టలో మైసమ్మ దేవత విగ్రహం బయట పడిందని పూర్వీకులు చెబుతున్నారు. చాలా సంవత్సరాల క్రితం కట్టెలు కొట్టి అమ్ముకునే వ్యక్తి అడవిలో దారి తప్పితే అతడికి చెట్టు కింద ఉన్న శిల ఒక ప్రత్యేక కాంతి రూపంలో దారి చూపిందని.. వెంటనే ఆ వ్యక్తి గ్రామస్తులకు విషయం చెప్పి పూజలు చేయడం ప్రారంభించినట్లు దేవాలయ చరిత్ర.



అమ్మవారి మూలవిరాట్

- అమ్మవారి ఆలయం ఒక మామూలు రాతి గుడితో ఉండేది. కొన్నేళ్ల క్రితం కాకర్లపహాడ్‌కు చెందిన నారాయణరెడ్డి అమ్మవారికి గుడి నిర్మాణం చేపట్టారు. దివంగత ఎర్ర సత్యం, మాజీ ఎమ్మెల్యేలు పి.చంద్రశేఖర్, ఎర్రశేఖర్, లక్ష్మారెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రుమాండ్ల రాంచంద్రయ్యల ఆర్థిక సహకారంతో దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. తాజాగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రూ. కోటితో అమ్మవారికి ఆభరణాలు చేయిస్తానని ప్రకటించారు.

అందరికీ సెంటిమెంట్..

ఎవరైనా కొత్త వాహనం కొనుగోలు చేసినా.. శుభకార్యాలు ప్రారంభించాలన్నా.. చివరకు ఎన్నికల ప్రచారం సైతం మైసమ్మ ఆలయం నుంచి ప్రారంభించడం సెంటిమెంట్‌గా మారింది. ఆది, మంగళవారాల్లో వేలాది భక్తులు మైసమ్మను దర్శించుకొని ప్రత్యేకంగా బోనాలు సమర్పించడం ఇక్కడి ప్రత్యేకత. తాజాగా ఇతర రోజుల్లో సైతం భక్తుల సందడి ఉంటుంది.

ప్రతి ఏటా ఉత్సవాలు..

ప్రతి ఏటా జనవరిలో అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే 3వ తేదీన ధ్వజారోహణ, కలశ స్థాపన, 4న అభిషేకం, 5న కవచధారణ, 6న అగ్నిస్థాపన, చండీ హోమం, 7న బోనాలు, శకటోత్సవం, 8న మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి..



మైసమ్మ ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం. కాకర్లపహాడ్ నుంచి పట్టువస్త్రాలు తీసుకువచ్చి ఉత్సవాలను ప్రారంభిస్తాం. భోనాల రోజు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తాం. ఉత్సవాలకు అందరూ సహకరించాలి.

– జగన్మోహన్‌రెడ్డి, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్

సోలార్ ప్లాంట్ నిర్వాహకులపై చర్య తీసుకోవాలి



బలీదుపల్లి ఊర చెరువును పరిశీలిస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి ఊర చెరువులో అక్రమంగా నిర్మించిన సోలార్ ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన బలీదుపల్లి ఊర చెరువును పరిశీలించారు. గత ప్రభుత్వంలో డబ్బులకు ఆశపడి సోలార్ కంపెనీలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు ఉండవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ.. గ్రీన్ ఎనర్జీ పేరుతో అడ్డగోలుగా నిబంధనలు ఉల్లఘించారని ఆరోపించారు. రాష్ట్రంలో చెరువులు, కుంటల సంరక్షణకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తుంటే.. జిల్లాలోని అధికారులు మాత్రం ప్రభుత్వ నిర్ణయానికి విరుద్ధంగా చెరువులను ఆక్రమించిన కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారనవి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై రైతుల పక్షాన గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య యాదవ్, వీవీ గౌడ్, అంజన్నయాదవ్, మహేందర్ నాయుడు, రాఘవేందర్‌గౌడ్, రమేష్ సాగర్, గౌతమ్, శంకర్, నర్సింహ్మయాదవ్, మహ్మద్ పాల్గొన్నారు.

గద్వాల ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



వినతిపత్రం చూపుతున్న బాధితులు

గద్వాల క్రైం: స్టాక్ మార్కెట్ ఏజెంట్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తమకు న్యాయం చేయాలంటూ ఇన్వెస్టర్లు గురువారం ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు కొండపల్లి, అనంతపురం గ్రామాలకు చెందిన నర్సింహులు, రవి, దామోదర్, లక్ష్మణ్ మాట్లాడారు. గద్వాల మండలం పూడూరు ఎర్రవల్లికి చెందిన కుర్వ వెంకటేశ్ స్టాక్ మార్కెట్‌లో షేర్లు కొనుగోలు చేస్తే అధిక లాభాలు వస్తాయని తను పని చేస్తున్న ఏంజిల్-1లో కొన్నిరోజుల క్రితం రూ.24 లక్షలు పెట్టుబడి పెట్టించారని వివరించారు. బంధువు కావడంతో నమ్మి వివిధ కంపెనీల షేర్లు కొనుగోలు చేశామని.. ధరలు పెరిగినప్పుడు విక్రయించే పనికూడా అతడే చేసేవారని చెప్పారు. తమతో పాటు మరి కొందరు బంధువులు, స్నేహితులు ఇదే కంపెనీలో రూ.2 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారని.. గతేడాది ఆగస్టులో కుర్వ వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడన్నారు. నామినిగా తన పేరు ఉందని.. అందరికీ న్యాయం చేస్తామని భార్య సుమిత్ర భరోసా ఇచ్చిందని తెలిపారు. ఆరు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో 30 రోజుల కిందట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని.. విచారించి న్యాయం చేస్తామని చెప్పి నిర్లక్ష్యం చేస్తున్నారని వివరించారు. ఈ విషయాన్నే ఎస్పీ దృష్టికి తీసుకొచ్చామని.. సత్వర న్యాయం చేయాలని కోరామన్నారు.